

పోలీసుల విచారణలో వెలుగుచూస్తున్న విస్తుపోయే నిజాలు

ప్రధాన సూత్రధారిగా మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు, సహకరించిన మరికొంత మంది

ఇప్పటికే ఒకరి అరెస్టు ..

మరికొందరిని విచారిస్తున్న పోలీసులు



సంచలనం

అమలాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాజకీయ పలుకుబడి... అప్పటి వైసీపీ ప్రభుత్వ అధికార బలంతో హత్య కేసును సైతం నిర్వీర్యం చేసి మరుగున పెట్టించేశారు. నిందితులంతా హ్యాపీగా తిరుగుతూనే ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వంలో విచారణకు నోచుకోని హత్య కేసులను పునర్విచారణ చేపట్టారు. దీనిలో భాగంగా అయినవిల్లి గ్రామానికి చెందిన దళితుడైన జనుపల్లే దుర్గాప్రసాద్(27) హత్యోదంతం వెలుగుచూసింది. ఈ ఘటనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ హస్తం ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెలుగుచూడటం సంచలనంగా మారింది. ఇప్పటికే ఈ హత్యకేసులో ఉప్పలగుప్తం మండలం విలసవిల్లికి చెందిన యువకుడు, వైసీపీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ వడ్డి ధర్మేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడు ఇచ్చిన సమాచారంతో మాజీ మంత్రి తనయుడు పినిపే శ్రీకాంత్‌ను తమిళనాడు రాష్ట్రంలోని మధురై సమీపంలో అదుపులోకి తీసుకుని కోనసీమకు పోలీసులు తరలిస్తున్నారు.



దుర్గాప్రసాద్



శ్రీకాంత్

దళిత యువకుడి హత్య కేసులో మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు!

తమిళనాడులోని మధురైలో పోలీసుల అదుపులో డాక్టర్ పినిపే శ్రీకాంత్

పథకం ప్రకారం వలంటీర్ దుర్గాప్రసాద్ హత్య

వైసీపీ హయాంలో మరుగున పడిన కేసు

అయినవిల్లి గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న జనుపల్లే దుర్గాప్రసాద్(27) అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో జూన్ 6, 2022న హత్యకు గురయ్యాడు. ఆ తరువాత మృతదేహం కోటిపల్లి రేవులో ఇసుక తిప్పపై దొరికింది. వలంటీర్ దుర్గాప్రసాద్ హత్యకేసుపై విచారణ జరపాలని ప్రజాసంఘాలు అప్పట్లో ఆందోళన చేసినప్పటికీ వైసీపీ నేతల రాజకీయ పలుకుబడితో కేసును అప్పటి పోలీస్ యంత్రాంగం నీరుగార్చి పక్కన పెట్టేసింది. అయితే దుర్గాప్రసాద్ భార్య ఆదర్శ విజ్ఞప్తిపై కేసు పునర్విచారణ చేపట్టాలని కార్మిక శాఖ మంత్రి, రామచంద్రపురం ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్‌ను కోరడంతో ఆయన పోలీస్ ఉన్నతాధికారులకు చేసిన విజ్ఞప్తి మేరకు దుర్గాప్రసాద్ హత్యకేసును తిరిగి విచారణ ప్రారంభించారు. దాంతో ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు, వైసీపీ నేత డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఉండడం సంచలనం కలిగించింది. ఈ కేసులో శ్రీకాంత్ పాత్రే కీలకం కావడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

హత్య చేసి కప్పిపుచ్చే ప్రయత్నం

దుర్గాప్రసాద్‌ను హత్య చేసిన నిందితులు ఆపై ఈ విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా వ్యవహరించారు. కేసులో నిందితుడిగా ఉన్న ధర్మేస్ హత్య తర్వాత ఎవ్వరికి అనుమానం రాకుండా దుర్గాప్రసాద్ భార్య ఆదర్శ ఆమె ఇద్దరి పిల్లలతో పాటు కొందరి యువకులను పోగు చేసి నిందితులను అరెస్టు చేయాలని ఆందోళన చేయడం కొసమెరుపు.. అదే విధంగా ఎవ్వరికి అనుమానం రాకుండా శ్రీకాంత్ కూడా ప్రవర్తించాడు. దుర్గాప్రసాద్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం చేయించడంతో పాటు భార్య పిల్లల్ని తీసుకుని ఎస్పీని కలిసి విచారణ చేపట్టాలని కోరినట్లు ధర్మేస్ వాంగ్మూలంలో స్పష్టం చేశాడు. ఈ కేసులో మరికొందరి నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. శ్రీకాంత్‌కు అప్పట్లో ఎక్కువ ఫోన్‌కాల్స్ చేసిన వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు.

మా వాడిని కావాలనే ఇరికించారు

మాజీ మంత్రి విశ్వరూప్

గత వైసీపీ ప్రభుత్వంలో పక్కన పెట్టేసిన దుర్గాప్రసాద్ హత్య కేసులో ప్రధాన సూత్రధారిగా వైసీపీ నేత డాక్టర్ శ్రీకాంత్ ఉండడంతో రాజకీయ దుమారం రేగుతోంది. మధురైలో డాక్టర్ శ్రీకాంత్‌ను అరెస్టు చేసిన సమయంలో అతను కొన్ని వ్యాఖ్యలు చేసినట్లు సోషల్ మీడియాలో వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. తాను డాక్టరనని ప్రాణాలు పోయడమే తెలుసు... ప్రాణాలు తీయడం తనకు తెలియదు అని కావాలని కుట్ర చేసి ఈ కేసులో ఇరికించారని శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి విశ్వరూప్ కూడా హైదరాబాద్‌లో స్పందించారు. తాను తిరువనంతపురం వెళ్తుండగా ఈ విషయం తెలిసిందని వెంటనే తన కుమారుడిని హైదరాబాద్ రమ్మన్నానన్నారు. కోర్టు ముందుగాని,

నాకు ప్రాణం పోయడమే వచ్చు..

మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్

పోలీస్‌స్టేషన్‌లో గాని లొంగిపోవడానికి తాను పిలిపించానని చెప్పారు. రాజకీయ దురుద్దేశంతో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన కుమారుడిపై రాజకీయ పలుకుబడితో అక్రమంగా కేసు బనాయించేందుకు కుట్ర చేశారని విశ్వరూప్ ఆరోపించారు. జిల్లా పేరు మార్పు సమయంలో తన ఇళ్లకు నిప్పుపెట్టిన కేసుల్లో ఏ-1గా వాసంశెట్టి సుభాష్ పేరు ఉందని ఆ కారణంతోనే తన కుమారుడుపై రాజకీయ బురదజల్లే కుట్రలో భాగమే ఈ హత్య కేసని వ్యాఖ్యానించారు. తానేంటో తన కుటుంబం ఏంటో కోనసీమలోని అన్ని వర్గాల ప్రజలకు తెలుసని ఎన్ని కుట్రలు చేసి ఎంత బురదజల్లినా తమకేమి నష్టం లేదని విశ్వరూప్ పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో నిజాలు నిగ్గు తేలుతాయని చెప్పారు.



బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తజన సందడి

విశేష పూజా కార్యక్రమాలు, అభిషేకాలు

వాహన సేవను చూసి తరించిన భక్తులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బందారు సత్యానందరావు

బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది..పండితులు సోమవారం శాస్త్రోక్తంగా విశేష పూజా కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ఉత్సవాలను తిలకించారు. తొలిరోజు శేషవాహన సేవ వేడుకగా సాగింది..

వార్తలు 6లో

నీటి సంఘాల ఎన్నికలను పక్కాగా నిర్వహించాలి

అమలాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జలవనరులు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి 22 మండలాల తహసీల్దార్లు, ఆర్డీవోలు, జలవనరులశాఖ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. జాబితా తయారీలో సందేహాలు ఉన్నట్టయితే జలవనరుల శాఖ ఇంజనీర్ల ద్వారా నివృత్తి చేసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ప్రతీ మండలానికి ఆధీకృత అధికారిగా ఉప తహసీల్దార్‌ను, ఎన్నికల అధికారిగా జలవనరులశాఖ ఇంజనీర్‌ను నియమించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీవిశ్వేశ్వరరావు, ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం



అమరవీరుల కుటుంబంతో కలెక్టర్



నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎస్పీ

కలెక్టర్ మహేష్‌కుమార్

జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసు సంస్మరణ దినోత్సవం

అమలాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. విద్రోహ శక్తుల నుంచి ధన, మాన ప్రాణాలను కాపాడేందుకు వారు చేస్తున్న త్యాగం అమోఘమన్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలోని ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న పోలీసు పెరేడ్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనునిత్యం అసాంఘిక శక్తులతో పోరాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బందికి నివాళులర్పించారు. ప్రభుత్వంలో ఎన్నో శాఖలు ఉన్నప్పటికీ పోలీసు శాఖ అందుకు భిన్నంగా 24 గంటలు పనిచేస్తుందని, ప్రజలకు రక్షణ కల్పించడంలో నిరంతరం కృషి చేస్తుందన్నారు. సమస్యల పరిష్కారానికి శాఖలను సమన్వయం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని చెప్పారు. ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు జరిగే సంస్మరణ కార్యక్రమాలు జాతీయ ఐక్యతా దినోత్సవం రోజున ముగియనున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో అన్ని జిల్లా ప్రధాన కేంద్రాల్లో పోలీసు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 28న మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ప్రజలంతా గాఢ నిద్రలో ఉంటే పోలీసులు మాత్రం మేల్కొని శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తారని కొనియాడారు. అడ్మిన్ ఎస్పీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అమర జవాన్ స్థూపాన్ని కలెక్టర్, ఎస్పీ ఆవిష్కరించారు. అమరులైన పోలీసు కుటుంబాలకు కలెక్టర్ చేతులమీదుగా కానుకలు అందించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రెండో అదనపు జిల్లా జడ్జి నరేష్, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు. తొలుత పోలీసుల నుంచి కలెక్టర్, ఎస్పీలు గౌరవ వందనం స్వీకరించారు.

26 నుంచి అప్పనపల్లిలో పవిత్రోత్సవాలు



మామిడికుదురు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి పవిత్రోత్సవాలను ఈ నెల 26వ తేదీ శనివారం నుంచి నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ రాజు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ పవిత్రోత్సవాలను త్రిదండి చినజీయర్‌స్వామివారి శిష్య బృందం, చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు గొడవర్తి శ్రీనివాస్ పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు. 26వ తేదీ ఉదయం 8 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విక్‌వరుణ, రక్తబంధన పూజ, చతుష్టాణార్చనలతో పాటు పలు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారని, 28వ తేదీ సోమవారం శ్రీవారికి ఏకాదశ ఫలరస సంహిత అష్టోత్తర శతకళ స్నపన తిరుమంజనం జరుగుతుందని, అనంతరం శ్రీవారి శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. భక్తులు మూడు రోజుల పాటు నిర్వహించే పవిత్రోత్సవాల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

246 అర్జీలు

అమలాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సీపీవో మధుసూదనరావు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణిలు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు నుంచి 246 అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, పెన్షన్ల మంజూరు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, ఆక్రమణల తొలగింపు, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రధానంగా అర్జీలను స్వీకరించినట్టు కలెక్టర్ తెలిపారు. దివ్యాంగుల ఇబ్బందులను గుర్తించి వారి వద్దకే వెళ్లి జేసీ నిషాంతి స్వయంగా అర్జీలను స్వీకరించారు.

పంచాయతీలకు అనుసంధానం చేయాలి

జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య ప్రతినిధుల నిరసన

గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ తీవ్ర గందరగోళంగా మారిందని తక్షణం సచివాలయాలను గ్రామ పంచాయతీలకు అనుసంధానం చేయాలని డిమాండు చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిబ్బందికి జీతాలు ఇచ్చేది ఒకరు, పనిచేయాలని ఆదేశించేది ఇంకొకరు, హాజరు చూసేది మరొకరు అంటూ రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్న ఈ వ్యవస్థపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

కాంట్రాక్టు సిబ్బందిని కొనసాగించాలి

రైతు సేవా కేంద్రాల్లో పనిచేసిన కాంట్రాక్టు సిబ్బంది వేడుకోలు

జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన గత రబీ సీజన్‌లో ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన జీతాలను చెల్లించడంతో పాటు వచ్చే సీజన్‌లో ఇప్పటి వరకు పనిచేసిన సిబ్బందిని కొనసాగించాలంటూ కలెక్టర్‌కు అర్జీ అందించారు. జిల్లా ఎంపిక కమిటీ డీఎస్సీ ద్వారా 950 మందికి కాంట్రాక్టు ఉద్యోగులుగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ద్వారా రిక్రూట్‌మెంట్ చేయడం జరిగిందని, అటువంటి టీఏ, డీఈవో, హెల్పర్లను తిరిగి వచ్చే సీజన్‌లో కొనసాగించాలని కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 21 అర్జీలు

అమలాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు 21 అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీసుస్టేషన్లకు సమాచారం అందించి చట్టపరంగా సమస్యలను పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. అల్లవరం మండలంతో పాటు కోనసీమలోని వివిధ ప్రాంతాలకు చెందిన 31 మందిని ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసి రూ.1.50 కోట్లతో ఉడాయించిన చర్చి పాస్టర్ ఆకుల షాలెంరాజుపై చర్యలు తీసుకోవాలని పలువురు ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అర్జీ అందించారు.



సత్య రథంతో గిరి ప్రదక్షిణ

7లో

కార్తీక పౌర్ణమి రోజున ప్రారంభం

లంకలగన్నవరంలో డొక్కా సీతమ్మ నివాసం




ఆమె స్మృతులు పదిలం!



తరాలు మారినా..చెదరని జ్ఞాపకాలు

అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ వస్తువులు ఇంకా భద్రంగానే..







సీతమ్మ నివాసంలో భోషాణం.. కావిడి పెట్టెలు.. సీతమ్మ నివాసంలో ఆమె వాడిన చెక్క కుర్చీ

(పి.గన్నవరం- ఆంధ్రజ్యోతి)

నిత్యాన్నదాతగా, అపర అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మ జ్ఞాపకాలు ఇంకా పదిలంగానే ఉన్నాయి. ఆమె స్వగ్రామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకలగన్నవరం గ్రామంలోని ఆమె నివాసంలో నేటికీ సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. బ్రిటీష ప్రభుత్వంతోపాటు ప్రపంచ దేశాల మన్నలను పొందిన సీతమ్మ వాడిన వస్తువులను వందేళ్లు దాటిన ఆమె వంశీయులు ఇంకా అపురూపంగా భద్రపరిచారు. సీతమ్మ జీవిత చరిత్రను గతంలో పలు ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా ముద్రించి విద్యార్థి దశ నుంచే ఆమె సామాజిక సేవను వివరించేవారు. రానురాను సీతమ్మ చరిత్రను పాఠ్య పుస్తకాల్లో తొలగించారు. ఈ తరుణంలో ఇటీవలే ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సీతమ్మ పేరు చిరస్థాయిగా నిలిచి ఉండేలా మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పేరును సూచించి పెద్దపీట వేశారు. అయితే ఆ రోజుల్లో ఆకలి అని వచ్చిన వారికి వండి వడ్డించిన సీతమ్మ వాడిన పెద్ద పెద్ద వంట పాత్రలను గణపతి మందిరాలు, సత్రాలకు అందించారని ప్రస్తుతం ఉన్న ఐదవ తరం వారసులు చెప్పుకొచ్చారు. ఆమె నివాసంలో ప్రస్తుతం చెక్కతో చేసిన భోషాణం ఇప్పటికీ చెక్కుచెదరకుండా అలాగే ఉంది. ఆరోజుల్లో ఆ భోషాణంలో పాత్రలు, వంటసామగ్రి తదితర వస్తువులను సీతమ్మ భద్రపరుచుకునేవారు. అలాగే సీతమ్మ వాడిన కావిడి పెట్టెలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. వీటిలో ముఖ్యంగా బంగారం నగలు, నగదు, ముఖ్యమైన వస్తువులతోపాటు చీరలను సైతం వాటిలో భద్రపరుచుకునేవారట. ఇంకా వంట నిమిత్తం వినియోగించిన సన్నికాలు, రుబ్బురోలు కూడా అలాగే ఉన్నాయి. అంతేకాకుండా సీతమ్మ చివరి రోజుల్లో ఎక్కువగా కూర్చున్న కుర్చీతోపాటు తాగు నీరుకు వినియోగించిన నుయ్యి సైతం పెరట్లో అలాగే ఉన్నాయి. కాగా సీతమ్మ నివాసానికి వెళ్లే రహదారిని అభివృద్ధి చేసి పర్యాటకులకు అందుబాటులో ఉంచితే బాగుంటుంది.





డొక్కా సీతమ్మ నివాసంలో నుయ్యి.. సీతమ్మ వాడిన రుబ్బురోలు



విద్యుత్ వెలుగులతో ఊరేగుతున్న రథం వాహనాలు

వేములవాడలో ఘనంగా దసరా సంబరం



- రథం వాహనాల ఊరేగింపు
- కన్నుల పండువగా జ్వాలాతోరణం

కరప, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కరప మండలం వేములవాడ గ్రామంలో సోమవారం రాత్రి దసరా సంబరం ఘనంగా జరిగింది. గ్రామంలోని మెరకవీధి, పల్లపువీధి రామాలయాల పెద్దలు ఏటా ఈ సంబరాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. ఇరు ఆలయ కమిటీల నేతృత్వంలో రంగురంగుల విద్యుత్ కాంతులతో ముస్తాబు చేసిన రథం వాహనాలను రాత్రి తెల్లవార్లూ గ్రామమంతా ఊరేగించారు. ఈ రథం వాహనాల ముందు బ్యాండ్‌మేళాలు, కోయడాన్స్‌లు, డీజే, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసి సంబరాన్ని విజయవంతం చేశారు. అంతకుముందు ఆయా ఆలయాల వద్ద నిర్వహించిన జ్వాలాతోరణం కన్నుల పండువగా జరిగింది. పొడవాటి దేవదారు కర్రలతో నిర్మించిన భారీ ఆర్చి నుంచి విద్యుత్ వెలుగులతో శోభాయమానంగా తీర్చిదిద్దిన రథాలను తీసుకెళ్లి సంబరాన్ని ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా జనం వెళ్లి ఈ సంబరాన్ని వీక్షించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కరప ఎస్ఐ తోట సునీత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.





వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో కొలువుతీరిన ఉత్సవమూర్తులు... (పక్కన) హాజరైన భక్తులు



ఉత్సవాల ప్రారంభ సూచికగా ధ్వజపతాకం



వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ
- శేషవాహనంపై విహరించిన శ్రీవారు
- విద్యుత్ వెలుగులు, పుష్పాలంకరణలతో సరికొత్త శోభ
- తొలిరోజు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

ఆత్రేయపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యుత్ దీపాలంకరణ, సుగంధ పరిమళాలు వెదజల్లే వేద పండితుల మంత్రోచ్ఛరణ, కళాకారుల ప్రదర్శనలు, భక్తజన గోవిందనామస్మరణల నడుమ వాడపల్లి పులకించింది. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం తొలిరోజు బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు- కమలరాణి చేతులు మీదుగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చక బృందం, బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వస్తివచనము, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనము, దీక్షాధారణ, కల్మసహోమము, అగ్ని ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలను రమణీయంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వసంత మండపంలో స్వామివారు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు- కమలరాణి దంపతులు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు-కనకదుర్గాదేవి దంపతులు పూజా మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం ధ్వజారోహణం నిర్వహించి అంకుర్వారణ చేశారు. ధ్వజపీఠం వద్ద వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకార మండపం, ఆలవార్ల మండపంలో పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. విద్యుద్దీపాలంకరణలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. పుష్పాలతో అలంకరించిన వేంకటేశ్వరస్వామి, తిరునామాలతో ఫొటోషూట్‌లు నిర్వహించారు. అనంతరం రాత్రి యాగశాలలో హోమాలు నిర్వహించారు. ధ్వజస్తంభం బలి పీఠం వద్ద ఉత్సవమూర్తులు కొలువుతీరారు. ధ్వజపటాన్ని ఊరేగిస్తూ దేవతలను ఆహ్వానించారు. ధ్వజస్తంభంలో ప్రతిష్ఠించిన గరుడికి పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకుర్వారణ చేశారు. కేరళ, తెలంగాణకు చెందిన వాయిద్య కళాకారుల ప్రదర్శనలు అమితంగా ఆకట్టుకున్నాయి. అనంతరం రాత్రి శ్రీవారు పరావాసుదేవ అలంకరణలో అలంకృతుడై శేషవాహనంపై కొలువుతీరారు. విద్యుత్ వెలుగులు, మేళతాళ మంగళవాయిద్యాలు, వేదఘోష, బాణసంచా కాల్పుల నడుమ శ్రీవారు తిరుమాడవీధులలో అశేష భక్తజన గోవిందనామస్మరణ నడుమ విహరించారు. అశేష భక్తజనం బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించిన తన్మయత్వం పొందారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ముదునూరి వెంకట్రాజు- సత్యశ్రావణి దంపతులు, సర్పంచ్ కాయల జగన్నాథం, పలువురు ప్రముఖులతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు వాడపల్లిలో....

శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం అష్టదళ పాదపద్మారాధన, సరస్వతి అలంకరణలో హంస వాహనంపై శ్రీవారి వాహన సేవ నిర్వహిస్తారు.

జిల్లా స్థాయి పోటీల్లో చెందుర్తి విద్యార్థుల ప్రతిభ

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 21(ఆంధ్ర జ్యోతి): జిల్లాస్థాయిలో జరిగిన సైన్స్ ప్రయోగాలు, గణితం క్విజ్ పోటీల్లో గొల్లప్రోలు మండలం చెందుర్తి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి బహుమతులు సాధించారు. క్రియా సంస్థ, అల్లం రాజు చారిటబుల్ ట్రస్టు సైన్స్ సెంటర్ సంయుక్తంగా పెద్దాపురంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాల 5,6వ తరగతుల విద్యార్థులు జగ్గారపు భాగ్యలక్ష్మి, పలివెల గౌతమి వెంకటలక్ష్మి పది రూపాయిలతో మైక్రోస్కోప్ తయారుచేసి ప్రదర్శించారు. దీనికిగాను నగదు పురస్కారం, మెమో ంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులను ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, హెచ్‌ఎం సావిత్రి, విద్యాకమిటీ చైర్మన్ జగ్గారపు శ్రీనివాస్‌లు అభినందించారు.



బహుమతులు అందిస్తున్న దృశ్యం

వివిధ క్రీడల్లో జిల్లా స్థాయి ఎంపికలు

కాకినాడ అర్బన్, అక్టోబరు 21: పాఠశాల విద్య జిల్లాశాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో జిల్లాస్థాయి క్రీడాకారులను సోమవారం డీఎస్‌ఏ ప్రాంగణంలో ఎంపిక చేసినట్టు కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. అండర్-14 టెన్నిస్, అండర్-17 బాక్సింగ్, అండర్ అండర్-14, 17 సైక్లింగ్ క్రీడాకారులను రాష్ట్రస్థాయి జట్లకు ఎంపిక చేశామన్నారు. అండర్-17, 19 టెన్నిస్‌లో ఎంపికలు మంగళవారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి రామ్‌కుమార్ ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ కార్యదర్శులు సునీల్‌కుమార్, పరుశరాం పీడీలు పాల్గొన్నారు.



ఎం.నాగులపల్లి శివారు అందాలమ్మ చెరువు ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత

అదిగో చిరుత!

- ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత
- బోన్లు ఏర్పాటు చేసిన అటవీశాఖ అధికారులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు



చిరుత తిరిగిన పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ద్వారకాతిరుమల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎం.నాగులపల్లి శివారులో రెండురోజుల క్రితం కన్పించి ప్రజలను బెంబేలెత్తించిన చిరుత.. ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాకు చిక్కింది. అది ఆ పరిసర ప్రాంతాల్లోనే మకాం వేసినట్టు అనుమానిస్తున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం ఉదయం ట్రాప్ కెమెరాలో చిరుత సంచారం నమోదు కావడంతో దానిని పట్టుకునేందుకు ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే చిరుత సంచారాన్ని ఖరారు చేసేందుకు ఆ ప్రాంతంలో దొరికిన దాని పాదముద్రలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగించి నమూనాలను తయారు చేశారు. వీటిని ల్యాబ్‌లో పరిశీలించేందుకు అటవీ శాఖ రేంజర్ రాజమండ్రికి పంపారు. ఈ క్రమంలోనే ట్రాప్ కెమెరాకు చిరుత సంచారం జాడ కన్పించడంతో అప్రమత్తమైన జిల్లా అటవీ శాఖ అధికారి ఆశాకిరణ్ సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ట్రాప్ కెమెరాలను అదనంగా మరో రెండు కెమేరాలను చిరుత జాడ కన్పించిన అందాలమ్మ చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేశారు.



చిరుతను పట్టుకునేందుకు బోనులు అమర్చుతున్న అధికారులు



జేఎన్‌టీయూకేలో జరిగిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ

మానవ జీవితంలో ఆహారం అత్యంత అవసరం

- ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ
- జేఎన్‌టీయూకేలో ఆహార దినోత్సవం

జేఎన్టీయూకే, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మానవ జీవితంలో ఆహారం అత్యంత అవసరమైందని జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకేలోని అలూమ్నీ ఆడిటోరియంలో స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, అసోషియేషన్ ఆఫ్ ఫుడ్ సైంటిస్ట్స్ టెక్నాలజిస్ట్స్ ఇండియా(ఏఎఫ్ఎస్టీఐ) కాకినాడ ఛాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో 'మెరుగైన జీవితం, మంచి భవిష్యత్ కోసం ఆహార హక్కు' నినాదంతో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్కూల్‌ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ అధ్యక్షత వహించగా వీసీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగాను, విశిష్ట అతిథిగా విశాఖపట్నంలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ) ఎమిరిటస్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ముక్తేశ్వర్‌ప్రసాద్, గౌరవ అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాద్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఆహారంతోనే జీవన మనుగడ సాగుతుందని, ఫుడ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని లేబొరేటరీలో ఆహార పదార్థాలను పరీక్షించేందుకు అత్యాధునిక టెస్టింగ్ సదుపాయాలున్నాయన్నారు. దీన్ని వినియోగించుకుంటే ప్రభుత్వపరంగా బాగుంటుందన్నారు. అనంతరం ముక్తేశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మనిషి తన జీవితంలో 35 టన్నుల ఆహారాన్ని తీసుకుంటారన్నారు. ప్రపంచంలో ఏటా అత్యధికంగా ఆహారాన్ని వృథా చేస్తున్నారని ప్రజలు ఆకలితో అలమటించకుండా చూడాల్సిన బాధ్యత ఫుడ్ ఇంజనీరింగ్ విద్యార్థులపై ఉందని తెలిపారు. రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ ఆహారానికి ఎంత ప్రాధాన్యమిస్తామో నీటికి అంతే ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ సందర్భంగా పలు క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ డైరెక్టర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్, ఏఎఫ్ఎస్టీఐ కాకినాడ ఛాప్టర్ కార్యదర్శి ఎం.చంద్రిక, జేఎన్టీయూకే, అక్నూ అనుబంధ, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు



కాకినాడఅర్బన్, అక్టోబరు21: గుంటూరులో ఈనెల 17 నుంచి 19 వరకు జరిగిన రాష్ట్ర జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో కాకినాడ క్రీడాప్రాధికార సంస్థలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు అండర్-10,11,12 విభాగాల్లో 46 పతకాలు సాధించారు. 17 బంగారు, 15 రజతం, 14 కాంస్య పతకాలు వీటిలో ఉన్నాయి. అండర్-12 విభాగంలో చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం క్రీడాకారులను శిక్షకుడు సురేష్‌ను డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.విశ్వేశ్వరరావు ఉపాధ్యక్షుడు ఎం.చిన్న అభినందించారు. క్రీడాకారుల్లో కొందరు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ సురేష్ తెలిపారు.



ఈవోకు విరాళం అందిస్తున్న ప్రదీప్‌కుమార్

భావనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.4.50 లక్షల విరాళం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సర్పవరంలోని శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి యామ్ గ్రీన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి ప్రదీప్‌కుమార్ రూ.4.50 లక్షల చెక్కును ఈవో (గ్రేడ్-1) మాచిరాజు లక్ష్మీనారాయణకు సోమవారం అందజేశారు. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్‌కు ఈవో కృతజ్ఞతలు తెలిపారు. భావనారాయణస్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ తనిఖీదారు ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో సోమవారం తెరిచి లెక్కించగా రూ.3,52,145 ఆదాయం లభించినట్టు ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. లెక్కింపులో ఆలయ మాజీ చైర్మన్ పుల్ల శ్రీను, గ్రామ పెద్దలు పుల్ల శ్రీరాములు, ముద్దన సూర్యప్రకాశరావు, పోలీసులు, రెవెన్యూ అధికారులు, సేవాదళ్ కార్యకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

16 మంది మృతికి కారణమైన

లారీ డ్రైవర్‌కు పదేళ్ల జైలు శిక్ష

పెద్దాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి వద్ద 2015లో జరిగిన లారీ ప్రమాద ఘటనకు సంబంధించిన కేసులో 16 మంది మృతికి కారణమైన ఓ లారీ డ్రైవర్‌కు 10 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డాక్టర్ దీపా దైవకృప సోమవారం తీర్పు వెలువరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాగం కామేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. 2015 సెప్టెంబరు 14న గండేపల్లి జాతీయ రహదారిపై జరిగిన ఘోర ప్రమాదంలో 16 మంది మృతి చెందారు. 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై అప్పటి గండేపల్లి ఎస్‌ఐ ఎన్.రజనీకుమార్ కేసు నమోదు చేశారు. వాదోపవాదాలు జరిపి 77 మంది సాక్షులను విచారించిన అనంతరం తీర్పు ఇచ్చారు. లారీ డ్రైవర్ జోగా శ్రీనుకు 10 సంవత్సరాలు జైలు, పాటు రూ.10 వేలు జరిమానా, క్లీనర్ బుట్ట లోవరాజుకు ఒక సంవత్సరం జైలు, రూ.వెయ్యి జరిమానా విధించారు.



ఇరుసుమండలో ఆనందరామేశ్వర స్వామిని దర్శించుకుంటున్న రామలింగేశ్వరరావు

ఏకాదశ రుద్రులపై పాట రాస్తా

ప్రముఖ సినీ గేయ రచయిత, కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

అంబాజీపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కోనసీమలో కొలువైన ఏకాదశ రుద్రులపై మంచి పాట రాస్తానని ప్రముఖ సినీ గేయ రచయిత, కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుడిని దర్శించుకున్నారు. అనంతరం అయినవిల్లి, అంబాజీపేట, అమలాపురం రూరల్ మండలాల్లోని పలు ఆలయాలను సందర్శించారు. అయినవిల్లి ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రులను సందర్శించారు. ఒక్కరోజే ఇలా దర్శించుకోవడాన్ని పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానన్నారు. కోనసీమలోని వాడపల్లి, అయినవిల్లి, అప్పనపల్లి ఆలయాలపై పాటలు రచించానన్నారు. ఇప్పటివరకు 600కిపైగా పాటలు రాసినట్టు చెప్పారు. నేదునూరు, వక్కలంక, ముక్కామల, వక్కలంక, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, మొసలపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, పాలగుమ్మి గ్రామాల్లో కొలువుదీరిన ఏకాదశ రుద్రులను దర్శించి అక్కడి భక్తులతో మాట్లాడారు. ఖ్యాతిగాంచిన జగ్గన్నతోట ప్రభల తీర్థం విశేషాలను తెలుసుకున్నారు.

అర్చకుల మధ్య సమసిన వివాదం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి ఉప్పాడలో ఇద్దరు అర్చకుల మధ్య తలెత్తిన వివాదం దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల జోక్యంతో సద్దుమణిగింది. ఉప్పాడలో శ్రీచౌడేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ అర్చకుల మధ్య వివాదం కారణంగా ఆలయానికి తాళాలు వేయడంతో భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై 'ఓ స్వామీ..నీ సేవ చేసే భాగ్యం ఎవరిదో' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం వచ్చిన కథనానికి దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి దుర్గాభవాని, ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పాడలో విచారణ చేపట్టారు. అర్చకుడు కప్పగంతుల రవితేజ, గతంలో పని చేసిన అర్చకుడు రమేష్‌లను విచారించారు. వ్యక్తిగత కారణాలతో వివాదం జరిగిందని, ఫలితంగా ఆలయానికి తాళం వేసినట్టు అధికారులు గుర్తించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే చర్యలు తప్పవన్నారు. స్వామివారి కైంకర్యాలను నిర్వహిస్తున్న అర్చకుడే ఎప్పటిలాగానే పూజలు చేస్తారని అధికారులు తెలియజేశారు. సక్రమంగా విధులు నిర్వర్తించాలని, ఆలయ ప్రతిష్టకు భంగం వాటిల్లేలా ప్రవర్తించొద్దని ఆదేశించారు. విచారణలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

అన్నవరం రైల్వే స్టేషన్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తుని రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నవరం రైల్వే స్టేషను ఒకటో నెంబరు ప్లాట్‌ఫామ్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత వ్యక్తి అనారోగ్యంతో మరణించి ఉంటాడని, అతని వయసు 35 నుంచి 40 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. నీలం రంగు టీ షర్టు, ముక్కుపొడి రంగు ప్యాంటు ధరించి వున్నాడు. ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులను గానీ, 94906 19020 నెంబర్లో గానీ సంప్రదించాలని ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు కోరారు.

సత్య రథంతో సత్యదేవుడి గిరి ప్రదక్షిణ

కార్తీక పౌర్ణమి రోజున మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం



అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కార్తీక పౌర్ణమి రోజున సత్యదేవుడి గిరి ప్రదక్షిణ సత్య రథంతో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతుందని అన్నవరం దేవస్థానం అధికారులు సోమవారం వెల్లడించారు. ఇప్పటిదాకా ఉదయం ఏడు గంటలకు ముందు పల్లకిలో స్వామి, అమ్మవార్లను ఉంచి తర్వాత సత్యరథంతో రత్నగిరి, సత్యగిరి చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. కార్తీక పౌర్ణమి వేళ స్వామివారి సన్నిధికి చేరుకున్న భక్తులు, గిరిప్రదక్షిణలో పాల్గొనే లక్షలాది మందితో తోపులాట, ఇతర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ నేపథ్యంలో అధికారులు వైదిక కమిటీ అభిప్రాయం తీసుకుంది. ఉదయం పల్లకిలో స్వామి, అమ్మవార్లను ఊరేగించి, మధ్యాహ్నం రెండు గంటలకు సత్యరథంతో ప్రదక్షిణ చేయించాలని నిర్ణయించారు. సింహాచలం దేవస్థానంలో ఈ విధానం ఇప్పటికే అమలవుతోందని వెల్లడించారు. అయితే భక్తులు సావకాశాన్ని బట్టి రెండింటిలోనూ పాల్గొనవచ్చన్నారు. కాగా ఈ నిర్ణయంపై భక్తులు, గ్రామస్తుల నుంచి బిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సత్య రథం ఊరేగింపును మధ్యాహ్నం ప్రారంభించినా ఎండ వేడి, కార్తీక పౌర్ణమి ఉపవాసాల నేపథ్యంలో అధిక సంఖ్యలో భక్తులు ఉదయం పల్లకితో పాటు గిరిప్రదక్షిణలో పాల్గొనే అవకాశం ఉంది. ఇంజనీరింగ్, ఆలయ, పీఆర్వో విభాగ అధికారులు సంబంధిత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

కార్తీక మాసోత్సవ కార్యక్రమాల వివరాలను దేవస్థానం విడుదల చేసింది. కార్తీకమాస ప్రారంభాన్ని పురస్కరించుకుని నవంబరు 1న ఆకాశ దీపం, 13న సత్యజ్యోతి ఊరేగింపు, రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 15వ తేదీ మధ్యాహ్నం సత్య రథంతో గిరిప్రదక్షణ, సాయంత్రం పంపా హారతులు, రాత్రి ఏడు గంటలకు జ్వాలాతోరణం, 22వన సత్యదీక్షాపరులతో పడిపూజ, 23న సత్య దీక్షల విరమణ, 29న జ్యోతిర్లింగార్చన.

వేటకు వెళ్లిన మత్స్యకారుడు గల్లంతు

అంతర్వేది, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపల్లిపాలెంలో సోమవారం తెల్లవారుజామున వేటకు వెళ్తూ మత్స్యకారుడు గల్లంతయ్యాడు. నక్కపల్లి నియోజకవర్గం రాజానగరానికి చెందిన బొంది నూకయ్య (50) దినచర్యలో భాగంగా వేటకు బయలుదేరి బోటు చివరన కూర్చున్నాడు. కెరటాల తాకిడికి ఒక్కసారిగా గోదావరిలో పడిపోయాడు. వెంటనే బోట్లు రావడంతో నూకయ్య ఆచూకీ తెలియలేదని అతడితో వేటకు వెళ్లిన నలుగురు మత్స్యకారులు స్థానికులకు తెలిపారు. నూకయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నూకయ్య ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ దుర్గాశ్రీనివాస్ చెప్పారు.

రైఫిల్ షూటింగ్ పిస్టల్ విభాగంలో

ఆల్‌రౌండ్ చాంపియన్ 'తూర్పు'



ప్రథమ బహుమతి అందుకుంటున్న తూర్పు గోదావరి జట్టు సభ్యులు

దివాన్‌చెరువు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్‌లో పిస్టల్ వ్యక్తిగత విభాగంలో తూర్పు గోదావరి జట్టు ఆల్‌రౌండ్ చాంపియన్‌గా నిలిచిందని తూర్పు గోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఏపీ పాఠశాల విద్యాశాఖ, క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూలులో జరిగిన అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్‌లో పిస్టల్ కేటగిరీలో విజేతల వివరాలను స్వామి సోమవారం విలేకరులకు వివరించారు.

అండర్-14 బాలికల విభాగంలో తూర్పు గోదావరి జిల్లాకుచెందిన ఎస్.దీక్షిత (ప్రథమ), టీకే ఆకృతి (ద్వితీయ), అనంతపురం జిల్లాకు చెందిన పి.ధాత్రి (తృతీయ) స్థానాల్లో నిలిచారు. అండర్-14 బాలురు విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన కె.అభిలాష్‌చంద్ర (ప్రథమ), తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జి.చంద్రహాస్ (ద్వితీయ), గుంటూరు జిల్లాకు చెందిన టి.సేతు మాధవ (తృతీయ) స్థానాల్లో నిలిచారు.

అండర్-17 బాలికల విభాగంలో విశాఖపట్టణం జిల్లాకు చెందిన ఎస్.నిష్ఠవైదుషి (ప్రథమ), గుంటూరు జిల్లాకు చెందిన వై.రాజరాజేశ్వరి (ద్వితీయ), విశాఖపట్టణం జిల్లాకు త్రిషవర్మ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. అండర్-17 బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జి.సూర్యప్రణవ్ (ప్రథమ), కృష్ణా జిల్లాకు చెందిన ఎస్.జహీర్ అలీ (ద్వితీయ), కర్నూలు జిల్లాకు చెందిన బి.హృషీకేశ్‌రెడ్డి (తృతీయ) స్థానాల్లో నిలిచారు.

అండర్-19 బాలికల విభాగంలో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఎస్‌డీ మహి జమీన్ (ప్రథమ), కర్నూలు జిల్లాకు చెందిన ఎం.పల్లవి (ద్వితీయ), అనంతపురం జిల్లాకు చెందిన ఎం.మల్లికాభాయ్ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. అండర్-19బాలురు విభాగంలో ఏపీ సూర్యరామ సంజయ్‌రెడ్డి (ప్రథమ), అనంతపురం జిల్లాకు చెందిన టి.వెంకటఅఖిల్ (ద్వితీయ), తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎస్.దత్తసాయితేజ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



ఓపీ విభాగంలో రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిలుచున్న రోగులు, వారి సహాయకులు



'ఓపీ'కి వెళ్తే బీపీ!

సర్వర్ డౌన్ అంటూ రిజిస్ట్రేషన్ చేయడంలో జాప్యం

సిబ్బంది పనితీరుపై రోగులు, వారి సహాయకుల ఆగ్రహం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీహెచ్ ఓపీ (అవుట్ పేషెంట్) విభాగం దారుణంగా తయారైంది. తమకు బీపీ లేకపోయినా అక్కడున్న వారు బీపీ తెప్పిస్తున్నారని వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు చెప్తున్నారు. అంతలా ఉంది ఇక్కడ పనిచేస్తున్న వైద్య సిబ్బంది పనితీరు. ప్రధానంగా ఓపీ రిజిస్ట్రేషనుకు సంబంధించి ఆసుపత్రి అధికారులు రోగులకు నరకం చూపిస్తున్నారనే భావన అందరిలోనూ వ్యక్తమవుతోంది. సోమవారం ఓపీ విభాగం వద్ద ఇలాంటి పరిస్థితే కనిపించింది. సర్వర్ డౌన్ అయ్యిందని, సిగ్నల్ లేదని, నెట్‌వర్క్ సరిగా పని చేయట్లేదని కుంటిసాకులు చెప్పడంతో రిజిస్ట్రేషన్ చేసే సిబ్బందితో పలువురు రోగులు, వారి సహాయకులు వాగ్వాదానికి దిగారు. తాము ఉదయం పది గంటలకు వస్తే మధ్యాహ్నం పన్నెండు గంటలైనా తమకు ఓపీ చీటీ రాయలేదని, మధ్యాహ్నం వెళితే డాక్టర్లు ఉంటారా అంటూ పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేస్తే సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ నెంబరు చెబితేనే కంప్యూటర్ ఓపీ స్లిప్ ఇస్తారు. ఈ ప్రక్రియకు గంటల సమయం లైన్‌లో నిలుచోవాల్సి రావడంతో రోగులు,వారి సహాయకులకు ప్రాణం పోయినంత పనవుతోంది. ఓపీ నమోదు సమయంలో రోగులకు అసౌకర్యం లేకుండా చూడాలని సిటీ ఎమ్మెల్యే పదేపదే చెప్పినా, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలిచ్చినా వీళ్లింతే ... మారరు అన్నట్టుగా ఓపీ సిబ్బంది ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధిక మెజార్టీ సాధించాలి'

కొవ్వూరు, అక్టోబరు 21 (ఆంధజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ, జిల్లా పరిశీలకుడు చిరంజీవి కోరారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఎన్డీఏ భాగస్వామ్యపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను కూటమి నాయకులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు బోడపాటి ముత్యాలరావు, టీడీపీ నాయకులు మద్దిపాటి సత్యనారాయణ, మేకల శ్రీను, జొన్నలగడ్డ శ్రీనివాస్, చావా శ్రీనివాస్ పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

ఆర్టీసీ బస్సు ఢీకొని దంపతుల మృతి

గోపవరం వద్ద ప్రమాదం

శుభకార్యానికి వెళ్తుండగా ఘటన



దంపతుల ప్రాణాలను బలిగొన్న కారణమైన ఆర్టీసీ బస్సు మృతి చెందిన వెంకటేశ్వరరావు, దుర్గ (పాత చిత్రం)



నిడదవోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సోదరుడి ఇంట్లో శుభ కార్యక్రమానికి వారెంతో ఆనందంతో బయల్దేరారు. మరో ఐదు నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకునేలోపు మృత్యువు బస్సు రూపంలో కబళించింది. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం గోపవరం వద్ద సోమవారం ఉదయం యాక్టివా స్కూటర్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో దంపతులు దుర్మరణం చెందారు. వివరాలు ఇలా వున్నాయి... పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం పైడిపర్రుకు చెందిన బెల్లంకొండ వెంకటేశ్వరరావు (63)-దుర్గ (50) దంపతులు కొవ్వూరు మండలం మద్దూరులోని తమ సోదరుడు మనుమడి పురిటి స్నానం, ఉయ్యాలలో పెట్టే కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం ఉదయం 9 గంటల సమయంలో యాక్టివాపై బయల్దేరారు. నిడదవోలు మండలం గోపవరం వద్దకు వచ్చేసరికి 10.30-11 గంటల మధ్య రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వైపు వస్తున్న నిడదవోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వారిని ఢీకొట్టింది. దంపతులిద్దరూ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బంధువులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. సమిశ్రగూడెం ఎస్‌ఐ కె.వీరబాబు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరరావు దంపతుల స్వగ్రామం విజ్జేశ్వరం కాగా కూలి పనుల నిమిత్తం తణుకు మండలం పైడిపర్రులో నివాసముంటున్నారు. ప్రమాదం విషయం తెలియడంతో పైడిపర్రు, విజ్జేశ్వరం, మద్దూరు గ్రామాల నుంచి బంధువులు నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. వారి రోదనలతో ఆసుపత్రి ప్రాంగణమంతా కన్నీటి సంద్రమైంది.



నిడదవోలు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో రోదిస్తున్న బంధువులు



నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపిస్తున్న అనపర్తి సీఐ సుమంత్, ఎస్‌ఐ శ్రీనునాయక్

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

అనపర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం అనపర్తి, కుతుకులూరు గ్రామాల్లో చోరీలకు పాల్పడిన నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అనపర్తి సీఐ సుమంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో అనపర్తిలోని మహాలక్ష్మి జ్యూయలరీ వర్క్ షాపులోను, కుతుకులూరులోని పులగం వెంకటరెడ్డి నివాసంలోను చోరీలు జరిగాయి. ఈ నేరాలకు పాల్పడిన రాయవరం మండలం వెదురుపాక గ్రామానికి కట్టా శివశంకర్‌ను అరెస్టు చేసి అతడి నుంచి 12 గ్రాముల బంగారం, 211 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే 50 చోరీ కేసులు పెండింగులో ఉన్నాయి. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనునాయక్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

11 మంది అరెస్టు... రూ.16 వేల నగదు స్వాధీనం

అనపర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని ధరణికోట శివారులో పేకాట శిబిరంపై ఎస్‌ఐ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 11మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.16,600 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కర్బలా యాత్రకు ముస్లిం భక్త బృందం

మామిడికుదురు, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి):కర్బలా యాత్రలకు నగరం గ్రామానికి చెందిన 25మంది ముస్లిం భక్త బృందం సోమవారం పయనమయ్యారు. ఈబృందానికి అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అభినందనలు తెలియచేసి వీడ్కోలు పలికారు. వారు కర్బలాలోని పలు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. భక్త బృందం స్థానిక పెదపంజీషలోప్రార్థనలు నిర్వహించి యాత్రకు వెళ్లారు. వారికి హాజీముఖర్రం హుస్సేన్, అబేద్ అలీ, పర్హత్ అలీబేగ్, అబ్రార్ హుస్సేన్, ఎంకే అబ్బాస్ వీడ్కోలు పలికారు.

- అమరవీరులకు పోలీసుల నివాళులు
- విద్యార్థులతో కలిసి ర్యాలీలు
- మానవహారంగా ఏర్పడి జోహార్లు

నదీపాయలో తాత్కాలిక రహదారి

పి.గన్నవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిని వరదలు ముంచెత్తడంతో నాలుగు నెలలుగా నాలుగు లంకగ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపాయాయి. వరదలు పూర్తిగా తగ్గిపోవడంతో సోమవారం నదీ పాయలో తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేసుకుంటున్నారు. పి.గన్నవరం మండలం గంటి పెదపూడి శివారు బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామస్తులు గోదావరికి ఎర్రనీరు వచ్చిన నాటి నుంచి నేటి వరకు నాలుగు నెలలుగా నాటుపడవలపై నానావస్థలు నడుమ రాక పోకలు సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో నదీపా యలో వరదపోటు యథాస్థితికి చేరుకోవడంతో లంక గ్రామస్తులు కోసం రెవెన్యూసిబ్బంది నేతృత్వంలో బూరుగులంక నదీపాయలో తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. గోదావరికి మళ్లీ వరదలు వచ్చే వరకు ఈతాత్కాలిక రహదారిపైనే లంకగ్రామస్తుల రాకపోకలు సాగిస్తారు. కాగా ఏఐఐబీ నిధులు రూ.49.50కోట్లతో నిర్మితమవుతున్న హైలెవిల్ వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పంటకాల్వపై వంతెన పనులు సుమారుగా పూర్తికాగా గోదావరి నదిపై నిర్మించే ప్రధాన వంతెన పనులు సాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం వచ్చే ఏడాదికి లంకగ్రామ స్తులకు నూతన వంతెన అందుబాటులోకి రావా ల్సివుంది. అయితే ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహ కరిస్తే అగ్రిమెంటుకు ముందే లంకగ్రామ స్తులకు వంతెనను అందుబాటులోకి తెస్తామని కాంట్రా క్టర్లు చెబుతున్నారు. వరదల సమయంలో ప్రమా దానికి గురైన పడవను ఇటీవలే బయటకు తీశారు. అది పూర్తిగా దెబ్బతిన్నట్లు సమాచారం. వచ్చె ఏడాది వరదల సమయానికైనా వంతెన ను అందుబాటులోకి తెస్తే లంక గ్రామస్తులకు అవస్థలు తప్పుతాయి.



గంటిపెదపూడిలో బూరుగులంక నదీ పాయకు తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రాజోలు ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే దేవ

రాజోలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలులో ప్రభుత్వ ఆసుపత్రిని సీఎస్సార్ నిధులు రూ.2కోట్ల 50లక్షలతో నూతనంగా నిర్మించనున్న వంద పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది సరైన వైద్యం అందించాలన్నారు. రాజోలు ప్రభుత్వాసుపత్రికి రెగ్యులర్‌గా ఇద్దరు గైనకాలజిస్టులను నియమించాలని డీఎంహెచ్‌వోను కోరినట్టు తెలిపారు. జిల్లా అధికారులు 15 రోజులకొకసారి సందర్శించాలన్నారు. రాజోలు ప్రభుత్వాసుపత్రి నుంచి వైద్య సిబ్బంది అమలాపురం ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని తన దృష్టికి వస్తుందని తెలిపారు. లక్కవరం ఆసుపత్రి కూడా ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, గుండుబోగుల పెద్దకాపు, రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, మంగెన భూదేవి, సర్పంచ్ రేవు జ్యోతి, ఉపసర్పంచ్ పామర్తి రమణ, గాలిదేవర వెంకన్నబాబు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, మానుకొండ దుర్గాప్రసాద్, కాంగ్రేగుల స్వామి, రావి మురళి, అడబాల విజయ్, గుబ్బల కుమార్, కడలి వెంకటరమణారావు, కసుకుర్తి త్రినాథస్వామి, ఉండవల్లి బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.



రాజోలులో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది

అమలాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం సాగిస్తుందని కాంగ్రెస్ జిల్లాశాఖ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం చిట్టిబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈనెల26నవిజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోనసీమ జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నందున తప్పనిసరిగా అందరూ హాజరు కావాలని కోరారు. అమలాపురం ఆర్టీసీబస్టాండుకు చేరుకుని పల్లెవెలుగు బస్సులో ప్రయాణిస్తూ మహిళలచే ఉచిత బస్సు ప్రయాణం హామీపై పోస్టుకార్డులు రాయించారు. పీసీసీ అధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్ చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణశాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, ముషిణి రామకృష్ణారావు, కుడుపూడి శ్రీనివాస్, యార్లగడ్డ రవీంద్ర, గెడ్డం సురేష్‌బాబు, మాచవరపు శివన్నారాయణ, షకీల, రాయుడు వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు చిట్టిబాబు

గురుకుల పాఠశాల సమస్యలపై వినతి

ముమ్మిడివరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల సమస్యలపై స్కూల్ యాజమాన్య కమిటీ నల్లా వీరవెంకటసత్యనారాయణ అధ్వర్యంలో అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్‌బాలయోగి, కలెక్టర్ మహేష్‌కుమార్‌లను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. పాఠశాలలో 600మంది విద్యార్థినులు చదువుతున్నారని, కనీసం మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయనకు వివరించారు. పాఠశాలలో స్కూల్ ప్రాంగణం లోతట్టుగా ఉండడంతో తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగి విషసర్పాలతో భయాందోళనకు గురవుతున్నారని ఆయనకు తెలిపారు. ఈసమస్యలపై కలెక్టర్ స్పందించి వారం రోజుల్లో ఇంజనీరింగ్ డిపార్టమెంట్ బృందాన్ని గురుకుల పాఠశాలకు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ హరీష్‌బాలయోగి సమస్యలపై స్పందించి అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో దాకే సత్తిబాబు, పినిపే దివ్యభారతి, ఎన్.హైమావతి, లంక వరప్రసాద్, బీరా అన్నవరం, ఎం.వీ.సూర్యం, మాజీ చైర్మన్ వడ్డి శ్యాంప్రసాద్, సిహెచ్.సుదీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ముంపు



కాశివానితూము సమీపంలో గృహాల చుట్టూ నిల్వ ఉన్న నీరు

ముమ్మిడివరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ముమ్మిడివరంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. నగర పంచాయతీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ముంపు నీరు బయటికు వెళ్లే మార్గం లేక నివాస గృహాల చుట్టూ చేరి ముంపునకు గురిచేసింది. దీంతో ఈగలు, దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు బయటికి వెళ్లేమార్గం లేకపోవడంతో నివాస గృహాల చుట్టూ చెరువును తలపిస్తున్నాయి. ఈగలు, దోమలు, పాముల బెడద ఎక్కువగా ఉందని మహిళలు, వృద్ధులు ఆరోపిస్తున్నారు. దీనిపై నగర పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

తాతా మనుమడిపై దాడి

ముమ్మిడివరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం మురుగుకాల్వ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో బడ్డీ పెట్టుకుంటే గ్రామంలో కొంత మంది భూస్వాములు ఆ బడ్డీని తొలగించారని, అడ్డుకున్న తనపైనా, తన మనుమడిపైనా దాడి చేశారని ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలేనికి చెందిన వస్త్రాల సుబ్రహ్మణ్యం సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ గ్రామానికి చెందిన కొందరు భూస్వాములు తాను పెట్టుకున్న బడ్డీని తాడుతో ట్రాక్టరుకు కట్టి దూరంగా లాగిపడేశారని, అడ్డుకున్న తనపైనా, మనుమడు అతికల గణేష్‌పైనా దాడి చేశారని, తనను నానా దుర్భా షలాడారని సుబ్రహ్మణ్యం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. విచారణ నిర్వహించి బడ్డీని తొలగించిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

యానాంలో న్యాయశాఖ కార్యదర్శి పర్యటన



కార్యదర్శి ఎల్ఏ సత్యమూర్తిని సత్కరిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, అధికారులు

యానాం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పర్యటనలో భాగంగా పుదుచ్చేరికి చెందిన న్యాయశాఖ కార్యదర్శి డాక్టర్ ఎల్ఏ సత్యమూర్తి సోమవారం సాయంత్రం యానాం చేరుకున్నారు. యానాం ప్రభుత్వ అతిథి గృహం వద్ద ఆయనకు పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం యానాం పరిపాలనాధికారి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. న్యాయశాఖ కార్యదర్శి డాక్టర్ ఎల్ఏ సత్యమూర్తిని ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సత్కరించారు. అనంతరం వివిధశాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రెవెన్యూ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి చేయూత

పి.గన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజులపాలెం శివారు అయినాలవారిపాలేనికి చెందిన కాపు విద్యార్థిని మద్దాలి దేవిశిరీష గత ఏడాది ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. దీంతో ఏపీ కాపు (ఏపి కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్) సంఘం విద్యార్థి చదువు నిమిత్తం స్కాలర్‌షిప్‌నకు ఎంపిక చేసింది. ఈక్రమంలో మొదటి ఏడాది చదువు నిమిత్తం ఖర్చయిన రూ.90వేలు సంఘ సభ్యులు చెక్కు రూపంలో దేవిశిరీషకు అందించారు. హైదరాబాద్‌కు చెందిన అలివ్ మిఠాయి అధినేత దొరరాజు, సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత నాగకుమార్‌లు విద్యార్థి చదువు పూర్తయ్యే వరకు ఆర్థిక సాయం అందిస్తారని గన్నవరం నియోజకవర్గ కాపు కన్వీనర్ పోల్నాటి నాగప్రసాద్ తెలిపారు. కాపు నాయకులు పైడిపర్తి చిన్ని, నంద్యాల నాయుడు, చిక్కం షైనర్‌బాబు, నాగిరెడ్డి శివప్రసాద్, నల్లా రామకృష్ణ, దంగుడుబియ్యం శ్రీనివాస్, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థినుల ఎంపిక

అంబాజీపేట, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తొండవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు, పీడీ పి.సూర్యనారాయణలు తెలిపారు. అండర్-18 విభాగంలో నవరపు లావణ్య ఈనెల25,26,27 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో జట్టులో పాల్గొంటారన్నారు. స్టాండ్‌బైగా పొగాకు పూజిక ఎంపికైందన్నారు. త్వరలో జరిగే అండర్-19 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు పిల్లి దుర్గాదేవి ఎంపికైందన్నారు. ఈనెల7,8,9 తేదీల్లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో హైస్కూల్ విద్యార్థిని మందా మౌనిక ప్రతిభ కనబరిచి రజిత పతకం సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, పీఎంసీ చైర్మన్ పేరాబత్తుల వెంకట సుబ్బారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

ఉప్పలగుప్తం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ఉద్యోగుల సహకారం అవసరమని నంగవరం, సన్నవిల్లి సర్పంచ్‌లు జిన్నూరి వెంకటేశ్వరరావు, చిక్కం జంగమయ్య అన్నారు. నంగవరం, సన్నవిల్లి గ్రామాల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సోమవారం నంగవరం సచివాలయంలో సన్మానించారు. బదిలీ అయిన కార్యదర్శి వీధి సత్యనారాయణ, డిజిటల్ అసిస్టెంట్ గౌస్ మొహిద్దీన్‌ఖాన్, జూనియర్ లైన్‌మాన్ ఎస్.విజయ్‌లను సన్మానించారు. ఎంపీటీసీ వంగా గిరిజానాగకుమారి, పంచాయతీ సభ్యులు కామిరెడ్డి నారాయణరావు, బుడితి వెంకట్రావు, మాజీ సర్పంచ్‌లు శీలం సూరిబాబు, చేటకాయల సూర్యావతి, హైస్కూల్ పీఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా, పంచాయతీ కార్యదర్శి ఆకేటి రాజబాబు, వీఆర్వో పెట్టా బాలాజీ పాల్గొన్నారు.

ఆ ఆరోపణల్లో వాస్తవం లేదు

ముమ్మిడివరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల రోడ్లు ఆధునికీకరణలో ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు నిధులు కేటాయించలేదని వైసీపీ నాయకులు కొందరు సోషల్ మీడియాలో ఆరోపణలు చేయడాన్ని టీడీపీ ముమ్మిడివరం పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి గోపి ఖండించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల రోడ్డు ఆధునికీకరణకు రూ.13.43కోట్లు మంజూరయ్యాయని, వాటితో గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు. నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు రూ.3.88కోట్లు కేటాయించామన్నారు. ముమ్మిడివరం మండలంలో రూ.68.62 లక్షలు, ఐపోలరం రూ.1.06కోట్లు, కాట్రేనికోన రూ.97లక్షలు, తాళ్లరేవు రూ.1.15కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

నేడు పర్యావరణ ప్రజాభిప్రాయ సదస్సు

అల్లవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఓడలరేవులో ఓఎన్జీసీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సదస్సు మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణకు ఓడలరేవు బీవీసీ కళాశాల రోడ్డులో పర్యావరణ సదస్సుకు హాజరుకావాలని సోమవారం గ్రామంలో దండోరా వేయించారు. ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్దకు సముద్ర అలలు చొచ్చుకు రావడం తీరంలో గ్రీన్‌బెల్ట్ ఏర్పాటులో ఓఎన్జీసీ వైఫల్యంపై అడిగేందుకు ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఇలాఉండగా ఓడలరేవు ఓఎన్జీసీటెర్మినల్‌లోకి సముద్రపు అలలు చొచ్చుకు రావడంపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌పూరికి మాజీ ఎంపీ చింతా అనురాధ లేఖ రాసినట్లు తెలిపారు.

నేడు జాబ్‌మేళా

అమలాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వికాసా, టెక్‌లాజిక్, ది అమలాపురం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు. ఈఅవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. 17 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ముమ్మిడివరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలసాగర్ అధ్వర్యంలో పోలీసులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్ నుంచి బల్లగేటు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల అమరవీరులకు నివాళులర్పించారు. ఈసందర్భంగా సీఐ మోహన్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరం బాలుర బాలికల హైస్కూల్ విద్యార్థులు, మాంటసోరీ విద్యార్థులు ఉపాధ్యాయులు, పోలీసులు, జనసేన పార్టీ నాయకులు గుద్దటి జమ్మి పాల్గొన్నారు.

అంబాజీపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలను మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక సెంటర్‌లో పోలీసు అమరవీరులకు నివాళులుర్పించారు. విధి నిర్వహణలో అశువులు బాసిన వారి త్యాగాలను మరువలేనివన్నారు.

అల్లవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్ఐ హరీష్‌కుమార్ అన్నారు. అల్లవరం పోలీస్‌స్టేషన్ వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఏఎస్ఐలు శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, గ్రామస్థులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

రాజోలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అశువులు బాసి అమరులైన పోలీసులను గుర్తు చేసుకుంటూ సీఐ టీవీ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజోలు సర్కిల్ కార్యాలయం వద్ద నుంచి గాంధీబొమ్మ సెంటర్ మీదుగా ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉన్న పోలీసు అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం. లక్ష్మణ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో విద్యార్థులతో కలసి పోలీసుల ర్యాలీ

కూటమి పాలనలో పల్లెల ప్రగతి



పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన కూటమి పాలనలో పల్లెల ప్రగతికి పల్లెపండుగ కార్యక్రమం విజయవంతంగా నడుస్తోందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బోడసకుర్రు, యెంట్రుకోన, దేవగుప్తం, రెల్లుగడ్డ, గుండెపూడి, తూర్పులంక, డి.రావులపాలెం, సామంతకుర్రు, ఎస్.పల్లిపాలెం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. తొమ్మిది గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. టీడీపీ కూటమి పాలనలో రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. బోడసకుర్రు టిడ్కో భవనాల వద్ద సబ్‌స్టేషన్ నుంచి గ్రామం అంతటికి విద్యుత్ సరఫరా ఇవ్వాలని బోడసకుర్రు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, తెలుగు రైతు నాయకులు వేగిరాజు వెంకట్రాజు, ఆకుల లక్ష్మణరావు, నడింపల్లి సుబ్బరాజు, సర్పంచ్‌లు సాధనాల వెంకట్రావు, రొక్కాల విజయలక్ష్మి, తిక్కిరెడ్డి శ్రీనివాస్, సుందరనీడి సాయికృష్ణ, ఉండ్రు భగవాన్‌దాస్, కేవీ.కర్రి సత్య, గెద్దాడ శ్రీను, తోలేటి నానాజీ, కంకిపాటి వీరబాబు, పోతుల నాగరాజు, బొర్రా రాజేష్, చింతా శ్రీనివాస్, అడపా శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ సయ్యద్ ఫకీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మలికిపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చొరవతో వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ.17లక్షల చెక్కులను విశ్వేశ్వరాయపురం క్యాంపు కార్యాలయంలో సోమవారం బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అందజేశారు. నియోజకవర్గంలో 22మంది బాధిత కుటుంబాలకు నగదును పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించండి

కాట్రేనికోన, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు శివారు బూలవారిమొండి వద్ద పంటకాల్వ చెత్తతో పేరుకుపోవడం వల్ల కాల్వ ఎగువ నుంచి కొట్టుకు వచ్చిన జంతు కళేబరాలు, ఇతర వ్యర్థాలు నిల్వ ఉండి స్థానికంగా కాలుష్యం వెదజల్లుతోందని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు విప్పర్తి మోహనరావు, విత్తనాల రాంబాబు క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చూడాలన్నారు.

మొబైల్ ఆధార్ శిబిరాల ఏర్పాటు

ముమ్మిడివరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్టు నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ కె.సత్యనారాయణ తెలిపారు. కొత్త ఆధార్ కార్డులు, ఆధార్‌కార్డుల్లో మార్పులు తదితర విషయాలకు సంబంధించి ఈనెల 22 నుంచి 25 వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. 22న గొల్లలవీధి, పోలమ్మ చెరువు సచివాలయాలకు సంబంధించి ముమ్మిడివరం జడ్పీ బాలుర హైస్కూల్‌లో, రాజులపాలెం, పల్లిపాలెం సచివాలయాలకు సంబంధించి 23న జడ్పీ బాలికల హైస్కూల్‌లో, బొండాయికోడుతూము, రాయుడువారిపాలెం సచివాలయాలకు సంబంధించి 24వ తేదీన ముమ్మిడివరం మున్సిపల్ కార్యాలయం వద్ద, సూరాయిచెరువు సచివాలయానికి సంబంధించి 25వ తేదీన సూరాయిచెరువు సచివాలయంలో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు వాయిదా

ఉప్పలగుప్తం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22,23 తేదీల్లో అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరగాల్సిన అండర్-14, 17 బాలుర, బాలికల క్రీడా ఎంపికలు వాయుగుండం కారణంగా వాయిదా పడినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అడబాల వెంకటశ్రీనివాస్ తెలిపారు. ఇందుపల్లి హైస్కూల్ ఆవరణలో ఈనెల23న జరగాల్సిన అండర్-17 బాలుర, బాలికల పవర్ లిఫ్టింగ్ పోటీలు సైతం వాయిదా పడ్డాయన్నారు. ఎంపికలకు త్వరలో తేదీలు ప్రకటిస్తామన్నారు.

వైభవంగా మహిషాసురమర్ధిని విగ్రహ పునఃప్రతిష్ఠ



ఉప్పలగుప్తం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చల్లపల్లిలో దేవదాయశాఖ నిధులతో పునర్నిర్మించిన ఆలయంలో సోమవారం మహిషాసురమర్దిని విగ్రహ పునఃప్రతిష్ఠ జరిగింది. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆలయ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పూజల్లో పాల్గొన్నారు. సుదర్శనం వెంకటజనార్దనాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గొలకోటి రాధాకృష్ణ, బేబీ దంపతుల ఆధ్వర్యంలోఅన్నసమారాధన జరిగింది. సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీ రాంబాబు, టీడీపీ నాయకులు అరిగెల నానాజీ, మెట్ల రమణబాబు, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, గొలకోటి చిన్నా, పోలిశెట్టి శివాజీ, యరగర్త వెంకటేశ్వరరావు, దెందుకూరి సత్తిబాబురాజు, సుంకర రాంబాబు, జనసేన నాయకులు పలచోళ్ల పద్మనాభం, దంగేటి బాబులు,అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా 1,008 కలశల పూజ



మోరిలో ప్రధాన రహదారిపై కలశలతో ఊరేగుతున్న అయ్యప్పస్వాములు



అయ్యప్పస్వామి 18 మెట్ల (1008 కలశల) పూజా మందిరం

అంతర్వేది,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మోరిలో పేరాబత్తుల సుబ్బారాయుడు,పళ్లపోతు పూర్ణయ్య గురుస్వాముల మోరి పీఠం ఆధ్వర్యంలో 1008 కలశల పూజా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. తొలుత మోరిమహాలక్ష్మమ్మ ఆలయం వద్ద పేరాబత్తుల సుబ్బారాయుడు గురుస్వామి పీఠం ఆధ్వర్యంలో గణపతి హోమంతో ప్రారంభమై స్వాములకు భిక్ష అనంతరం 1008కలశలతో అయ్యప్ప స్వాములంతా మోరి మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద నుంచి రోడ్డు మార్గాన మలికిపురం మీదుగా టేకిశెట్టిపాలెం బాడిరేవు వంతెన వద్దకుచేరుకునిపుణ్యస్నానాలు ఆచరించి కలశలతో కేరళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ తిరిగి మోరి చేరుకున్నారు. 1008కలశల పూజా మహోత్సవాన్ని నిర్వహించారు. రాజోలు నియోజకవర్గంలోని స్వాములందరూ కలశల పూజామహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఉండి గ్రామానికి చెందిన నల్లా విజయలక్ష్మి, చారిటబుల్ ట్రస్టు అధినేత నల్లా సత్యకిరణ్‌కృష్ణప్రసాద్ రూ.లక్షను పూజామహోత్సవానికి ఇచ్చి నట్టు పేరాబత్తుల సుబ్బారాయుడు పీఠం స్వాములు తెలిపారు.

జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు వెంకటరత్నం



వెంకటరత్నంను సత్కరిస్తున్న జిమ్ క్రీడాకారులు

అమలాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం బీఎస్ఎన్ఎల్‌లో పనిచేస్తున్న ఉద్యోగి బీహెచ్ వెంకటరత్నం జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఏపీ సర్కిల్ సెలక్షన్స్ విజయవాడలో నిర్వహించగా 83 కిలోల విభాగంలో వెంకటరత్నం అద్భుత ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నవంబరు 11 నుంచి 13వ వరకు గువహటిలో జరిగే 20వ ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు వెంకటరత్నం ఎంపిక కాగా సోమవారం అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మట్టపర్తి సముద్రం, ముత్తాబత్తుల వెంకటరమణ, పద్మావతి, కృష్ణ, సుమన్, మణికంఠ, కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

మద్యం షాపు పెట్టవద్దని స్పందనలో ఫిర్యాదు

అల్లవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అల్లవరం, గోపాయిలంక రోడ్డులో గతంలో మద్యం షాపు పెట్టిన ప్రాంతంలో మద్యం షాపు పెడితే ఉద్యమిస్తామని ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని అల్లవరం, గోపాయిలంక ప్రజలు స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేశారు. రహదారిపై మద్యం షాపు వల్ల మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు పడతారని జిల్లా కలెక్టర్‌కు, తహసీల్దారు, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేశారు. గోపాయిలంక రోడ్డులో షాపు పెట్టవద్దంటూ టీడీపీ రాష్ట్ర మహిళా మీడియా కోఆర్డినేటర్ మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, మాకిరెడ్డి సత్తిబాబు, విశ్రాంత విజిలెన్స్ డీఎస్పీ నిచ్చెన్నకోళ్ల సుదర్శనరావు, ఎంపీటీసీ ఎస్.మౌనిక వరలక్ష్మితో పాటు పెదగరువు, మామిడితోట పరిసర ప్రాంతాల్లో అధికారులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్లు

యానాం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో 2023-24 ఏడాదికి మారోసారి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణా సుధాకర్ తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ ఆదేశాలతో అడ్మిషన్లు ఈనెల30 వరకు పొడిగించామన్నారు. అభ్యర్థులు వివిధ ట్రేడ్స్‌లో ఖాళీగా ఉన్న సీట్లులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చాను. మరిన్ని వివరాలకు 9491441164, 0884- 2951001ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు అశ్విక ఎంపిక



అమలాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయిలో కాకినాడలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో పేరూరు ఐరా ఇంటర్నేషనల్ స్కూలు 3వ తరగతి విద్యార్థిని రాయుడు అశ్విక ప్రథమస్థానం సాధించింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అశ్వికను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

జొన్నాడ ర్యాంపు నుంచి ఉచిత ఇసుకకు శ్రీకారం

ఆలమూరు, అక్టోబరు 21: జొన్నాడ ఇసుక ర్యాంపు నుంచి ఉచిత ఇసుక తవ్వకాలు సోమవారం ప్రారంభించారు. ర్యాంపు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా తీసుకెళ్లవచ్చునని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజలు ఎగబడుతున్నారు. వాస్తవానికి జొన్నాడలో ఇసుక రీచ్ నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఉచితంగా ఇసుకను నదిలో నుంచైనా తవ్వకాలు చేసుకోవచ్చునని ప్రకటించడంతో జొన్నాడ ఇసుక ర్యాంపులో సోమవారం తవ్వకాలు మొదలు పెట్టారు.

అధ్వానంగా సత్యనారాయణపురం జగనన్న కాలనీ

● ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు ● కాలనీల్లో గృహాల చుట్టూ నీరు నిల్వ
● అందని రక్షిత మంచినీరు ● మౌలిక వసతులు కల్పించలేదని ఆవేదన


గృహాల చుట్టూ చేరిన వర్షం నీరు

కపిలేశ్వరపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం శివారు సత్యనారాయణపురానికి ఆనుకుని నిర్మించిన జగనన్న కాలనీ అధ్వానంగా మారింది. దీంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా డ్రైన్స్ లేకపోవడంతో నీరు పారే మార్గం లేక వర్షం వస్తే కాలనీ మొత్తం ముంపునకు గురవుతుంది. కాలనీలో యర్ర గ్రావెల్‌తో వేసిన రోడ్లు అనేక చోట్ల దిగబడిపోవడం, బురదమయంగా మారడంతో ఆ కాలనీవాసుల అవస్థలు వర్ణనాతీతం. ఎక్కడికక్కడ తుప్పలు మొలచి పోవడం, నీరు నిలిచిపోవడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయని కాలనీవాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో వాడకం నీరు దిగేమార్గం లేక గుంతలు తవ్వకుని నీరు తోడుకుని బయట పోయాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు గగ్గోలు పెడుతున్నారు. కాలనీ అయితే నిర్మించారు గానీ సరైన మౌలిక వసతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో నిర్మించిన వాటర్‌ట్యాంకు నేటికి ప్రారంభించలేదు. దీంతో రక్షిత తాగునీరు అందడం లేదు. వర్షం వస్తే కాలనీల్లో గృహాలు చుట్టూ నీరు నిలిచిపోవడం, రహదారులు ఛిద్రం కావడంతోఇబ్బందులు పడుతున్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని కాలనీవాసుల కోరుతున్నారు.




కాలనీలో నిర్మించిన వాటర్ ట్యాంకు, గృహాల మధ్య పెరిగిన తుప్పలు , ఛిద్రంగా మారిన కాలనీ రహదారి

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ జాప్యంపై సమీక్ష



ఫ్లైఓవర్ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు తదితరులు, అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణంలో జాప్యంపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణంపై సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్వర్యంలో హైవే అధికారులు, నిర్మాణ కాంట్రాక్టర్, స్థానిక నాయకులతో సమీక్ష ఏర్పాటు చేశారు. వర్షాలు అధికంగా పడుతుండటంతో పని ముందుకు సాగడం లేదని శ్రుతి కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధి రామకృష్ణ తెలిపారు. దీంతో ఎమ్మెల్యే బండారుతో పాటు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం వద్ద జొన్నాడ వద్ద ఒకేసారి పని ప్రారంభించారని అక్కడ ఫ్లైఓవర్ ప్రారంభమయిందని అయితే ఇక్కడ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. వర్షాలు ఇక్కడే పడుతున్నాయా మిగిలిన చోట్ల వర్షాలు పడటం లేదా అని ప్రశ్నించారు. మరి అక్కడ పనులు కొనసాగుతున్నప్పుడు ఇక్కడ ఎందుకు జరగటం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం కాంట్రాక్టర్ ఇచ్చిన గడువు ముగియడంతో మళ్లీ పెంచుతున్నారని హైవే అధికారులు సురేంద్రనాథ్, బాలసుబ్రహ్మణ్యం, ఎ.శ్రీనివాస్ చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయనున్నట్లు కాంట్రాక్ట్ ప్రతినిధి రామకృష్ణ వివరించారు. ఎట్టి పరిస్థితిలోను ఇచ్చిన సమయానికి పని పూర్తి చేయాలని ఎమ్మెల్యే బండారు కోరారు. ఈ సమీక్షలో కూటమి నాయకులు ఆకుల రామకృష్ణ, సతీష్‌రాజు, తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, అయినవిల్లి సత్తిబాబు, నాగిరెడ్డి స్వామి, ఈదల నల్లబాబు, చుండ్రు శ్రీనివాస్, యేరుబండి ధర్మరాజు పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ప్రసాద్ తదితరులు

ఇప్పనపాడులో భూ సమస్యల పరిష్కార వేదిక సభ

మండపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నదని ఇప్పనపాడు ఉపసర్పంచ్ కుంచే వీరవేణి ప్రసాద్ అన్నారు. ఇప్పనపాడు సచివాలయంలో సోమవారం జరిగిన గ్రామసభకు ఆయన అధ్యక్షత వహించారు. గ్రామసభకు మండల సర్వేయర్ సుజాత, ఆర్‌ఐ వాసంతి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌వీవీ సుబ్బారావు హాజరయ్యారు. రైతుల నుంచి భూసమస్యలకు సంబంధించిన 15వరకు ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. గ్రామసభలో వీఆర్వో కిరణ్, రెవెన్యూ సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

● అమరవీరులకు నివాళులర్పించిన పోలీసులు
● పోలీసులు, విద్యార్థులు ర్యాలీలు
● మానవహారంగా ఏర్పడి నివాళి

పోలీసు అమరవీరులు త్యాగం మరువలేనిది





మండపేట స్టేషన్‌లో నివాళులర్పిస్తున్న సీఐ దొరైరాజు, కె.గంగవరం: పామర్రులో నివాళులర్పిస్తున్న ఎస్ఐ జానీబాషా, కొత్తపేట: వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ

మండపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అశువులు బాసిన పోలీసుల అమరవీరు త్యాగం మరువలేనిది మండపేట రూరల్ సీఐ పి.దొరైరాజు అన్నారు. మండపేటలో పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురష్కరించుకుని జరిగిన ర్యాలీలో సీఐ పాల్గొన్నారు. స్థానిక కలవపువ్వు సెంటర్ నుంచి రాజారత్న సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలోస్థానిక పట్టణ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండపేట రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు సారథ్యంలో పోలీసు అమరవీరుల దినోత్సవ కార్యక్రమంలో తాపేశ్వరం శ్రీచైతన్య విద్యార్థులు పాల్గొన్నారు. గ్రామంలో విద్యార్థులు, పోలీసులు మానవహారం నిర్వహించారు. సమాజంలో పోలీసుల పాత్ర గురించి ఎస్ఐ సురేష్‌బాబు వివరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి, శ్రీచైతన్య తాపేశ్వరం బ్రాంచి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

కె.గంగవరం, అక్టోబరు 21: సమాజసేవ కోసం విధి నిర్వహణలో పోలీసులు చేసిన త్యాగాలు మరువలేనివని పామర్రు ఎస్ఐ ఎస్.కె.జానీ బాషా అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పామర్రు పోలీస్‌స్టేషన్ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి అమరవీరులకు నివాళులర్పించారు. అమర వీరుల త్యాగాలు గుర్తుచేశారు. కార్యక్రమంలో పామర్రు పోలీసు సిబ్బంది, గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


ఆలమూరులో పోలీస్ అమరవీరుల సంస్మరణ ర్యాలీ

వీకేవీలో అమరవీరుల దినోత్సవం

కొత్తపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట విశ్వకవి వేమన డిగ్రీ కళాశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీరాజు సంస్మరణ దినోత్సవ స్థూప చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి పోలీసు అమరువీరులు జోహార్ అంటూ నినాదాలిచ్చారు. పోలీసు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.కనకరాజు, భ్రమరాంబ, అధ్యాపకులు కె.సత్యనారాయణ, డీసీహెచ్ పాపారావు, సీహెచ్ నాగరాణి, విజయకుమార్, ప్రసాద్, నాగదీపిక, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలమూరులో ర్యాలీ

ఆలమూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆలమూరు పోలీస్ స్టేషన్ నుంచి ఆలమూరు బస్టాండ్ వరకు ఏఎస్ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బది, మహిళా పోలీసులు ర్యాలీ చేశారు. అమరులైన పోలీసులకు నివాళులర్పించారు.

చిరు వ్యాపారులపై దురుసుగా ప్రవర్తించడం తగదు


ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద అధికారులతో కలిసి డ్రెయిన్ పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం చిరు వ్యాపారాలు చేసుకునే వారిపై హైవే సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం నుంచి ఈతకోట టోల్‌గేట్ వరకు అధికారులతో కలిసి రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల ఎదు రుగా చేపట్టిన సర్వీసు రోడ్డు ఆటం కాలు లేకుండా చూస్తామని, ఆ రోడ్డును వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్సు అరటి మార్కెట్ వద్ద డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని హైవే అధికారులను ఆదేశించారు. కక్ష సాధించే విధంగా కొంతమంది వ్యాపారుల దుకాణాల వద్ద ఉన్న బోర్డులను హైవే సిబ్బంది తొలగిస్తున్నారని, ఇది తగదని హెచ్చరించారు. విభేదాలకు నెలవుగా మారిన టోల్ గేట్ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతీ టోల్‌గేట్ వద్ద ప్రొటోకాల్ వాహనాలకు ప్రత్యేక మార్గం ఉన్నట్టే ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని హైవే అధికారులకు సూచించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించండి

కాట్రేనికోన, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు శివారు బూలవారిమొండి వద్ద పంటకాల్వ చెత్తతో పేరుకుపోవడం వల్ల కాల్వ ఎగువ నుంచి కొట్టుకు వచ్చిన జంతు కళేబరాలు, ఇతర వ్యర్థాలు నిల్వ ఉండి స్థానికంగా కాలుష్యం వెదజల్లుతోందని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు విప్పర్తి మోహనరావు, విత్తనాల రాంబాబు క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చూడాలన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ


స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పలివెల కోటమెరకలో వేంచేసి ఉన్న శ్రీఆంజనేయ స్వామి నూతన ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాదే లక్ష్మీశ్రీనివాస్, నల్లా వెంకటరమణ, మోకా రామ్మోహనరావు, కరెట్ల మురళీ, గొలకోటి శ్రీనివాస్, మోకా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎంపీపీ మార్గాన గంగాధర్, ముత్యాల వీరభద్రరావు ఈమహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


కోటిపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

కార్మిక శాఖ మంత్రి సుభాష్

కె.గంగవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ప్రాధాన్యత క్రమంలో కల్పిస్తామని కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కోటిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి మన గ్రామం మన సుభాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో చేపట్టాల్సిన పనులపై కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. తొలుత రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోటిపల్లి సర్పంచ్ పెమ్మాడి బేబి, టీడీపీ సీనియర్ నాయుడు రేవు శ్రీను, బీజేపీ నాయకుడు కర్రి చిట్టిబాబు, ఉప సర్పంచ్ తమ్మా వెంకటరమణ (చిన్న), కూటమి నాయకులు గొడవర్తి రామకృష్ణ, చిర్రా రాజ్‌కుమార్, చీకట్ల రాము, చీకట్ల సతీష్, గ్రామ కార్యదర్శి ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



తామరపల్లి సభలో మాట్లాడుతున్న డిప్యూటీ తహశీల్దార్ మురళి

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కరించుకోండి

కె.గంగవరం, అక్టోబరు 21: భూ సర్వే సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. సోమవారం తామరపల్లి గ్రామ పంచాయతీ వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ మురళి మాట్లాడుతూ భూసర్వేలో సమస్యలున్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. రైతుల దరఖాస్తులపై నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని తెలిపారు. సదస్సులో సర్పంచ్ తోకల మంగ, ఆర్ఐ వెంకట్రావు, వీఆర్వో అమ్మాజీ, టీడీపీ నాయకుడు గన్ని శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం సర్వీసు ప్రారంభిస్తున్న మంత్రి

సుదూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు

మంత్రి వాసంశెట్టి

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం డిపో నుంచి సుదూర ప్రాంతాలకు మరిన్ని బస్సు సర్వీసులకు కృషి చేస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి ఇచ్ఛాపురం వరకు వయా విశాఖ మీదుగా మూడు అల్ట్రా డీలక్సు బస్సు సర్వీసులను మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రామచంద్రపురం నుంచి భద్రాచలం బస్సు సర్వీసులు నడపాలని వినతులు వస్తున్నాయన్నారు. బస్సు సర్వీసులు ప్రారంభించిన మంత్రి బస్సులో ఆశీనులయ్యారు. కార్యక్రమంలో డీపీటీవో శ్రీనివాసరావు, డిపో మేనేజరు భాస్కర్, విజిలెన్స్ అధికారి రామారావు, ఏఎంఎఫ్ రవిబాబు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ఆర్థికసాయం

కె.గంగవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం గ్రామానికి చెందిన ఇళ్ళ సత్తిబాబు తన పిల్లల అనారోగ్య పరిస్థితిని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు తెలిపారు. వెంటనే స్పందించిన మంత్రి రూ.10వేలు ఆర్థికసాయం అందజేస్తూ పింఛన్ వచ్చే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మందులకు అయ్యే ఖర్చులు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్, కూటమి నాయకులు పేరాబత్తుల నాగేష్, సలాది జకారియా, పెంటపాటి లోవ ప్రసాద్, తుమ్మలపల్లి దుర్గ తదితరులు పాల్గొన్నారు.



మెయిన్ రోడ్డులో గోతులను చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

దాత సహకారం...

రోడ్డు పనులకు మరమ్మతులు

ఆలమూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జొన్నాడ-మండపేట ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గోతులను దాత సహకారంతో చదును చేసే పనులు ప్రారంభించారు. ఈ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడటంతో తరచూ అనేక ప్రమాదాలు జరుగుతుండటాన్ని గుర్తించిన ఆలమూరుకు చెందిన వ్యాపారవేత్త వంటిపల్లి కాశీవిశ్వనాథం ఎక్స్‌కవేటర్‌ని ఏర్పాటు చేసి భారీ గోతులను చదును చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పనులను ఆలమూరు ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు పర్యవేక్షించి ప్రమాదభరితంగా ఉన్న ప్రాంతాలలో గోతులను పూడ్చే కార్యక్రమం చేపట్టారు. రోడ్డును చదును చేయడానికి ముందుకొచ్చిన దాత కాశీవిశ్వనాథంను పలువురు ప్రయాణికులు, వాహనదారులు, స్థానికులు అభినందించారు.

పేదల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం


సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పేదలకు అన్ని విధాలా అండగా ఉండి వారికి ఆర్థిక పురోభివృద్ధి కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని 11 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభి రామారావు, చిలువూరి సతీష్‌రాజు, కాసా సాగర్, రాచకొండ శ్రీను, మాసాబత్తుల ఆనందరావు, గుర్రాల నాగభూషణం, మైగాపుల గురవయ్యనాయుడు, రెడ్డి శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలో పిల్లలను చేర్చొద్దు

కె.గంగవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్చవద్దని ఎంఈవో ఏ.నాగరాజు అన్నారు. భట్లపాలికలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బాలాదిత్య ప్రైవేటు స్కూల్‌ను మూసివేశామన్నారు. అయినప్పటికీ వేరే మార్గాల ద్వారా స్కూల్ నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై వారికి సూచనలు చేశామని, అనుమతులు తెచ్చుకునే వరకూ బోధన చేయకూడదని తెలిపామన్నారు. పిల్లలను పంపితే తదనంతరం తలెత్తే సమస్యలకు విద్యార్థుల తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎంఈవో తెలిపారు.


కమిటీ ఛైర్మన్ దినకర్‌ను సత్కరిస్తున్న కూటమి నేతలు

20 సూత్రాల కమిటీ ఛైర్మన్‌కు కూటమి నేతల అభినందన

రాయవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల 20 సూత్రాల కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన లంక దినకర్‌ను సోమవారం మండలానికి చెందిన పలువురు కూటమి నేతలు విజయవాడలో సత్కరించి అభినందించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు, చిరట్ల సుబ్బారావు, నరాల రాంబాబు, టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబులు విజయవాడలో దినకర్‌ను సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.


శ్రీశైలంలో మొక్కు తీర్చుకున్న జొన్నాడకు చెందిన శ్రీనివాస్

మొక్కు తీర్చుకున్న బండారు అభిమాని

ఆలమూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభిమాని భావన శ్రీనివాస్ సోమవారం శ్రీశైలంలో మల్లన్న దర్శనం చేసుకుని మొక్కు తీర్చుకున్నారు. జొన్నాడ నుంచి 7న పాదయాత్రగా బయలుదేరి 450 కిలోమీటర్లు 13 రోజుల వ్యవధిలో నడిచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని కొత్తపేటలో ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు గెలవాలని ఆయన మొక్కుకున్నారు.


సంఘ సభ్యురాలికి ఆర్థికసాయం అందిస్తున్న దేనియల్‌పాల్

ఆపన్నులకు పాస్టర్స్ ఫెలోషిప్ అండ

మండపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆపన్నులను ఆదుకోవటంలో కోనసీమ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ముందుంటుందని జిల్లా అధ్యక్షుడు బిషప్ డాక్టర్ దేనియల్‌పాల్ అన్నారు. తాపేశ్వరం జీసస్ క్రైస్ట్ గ్లోరి చర్చి ప్రాంగణంలో సోమవారం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. దేనియల్ పాల్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి పాస్టర్స్ ఫెలోషిప్ సంఘ నాయకులు హాజరయ్యారు. సంఘం బలోపేతానికి సేవా కార్యక్రమాలు ముందుకు తీసుకువెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు నిర్ణయాలను తీసుకున్నారు. ఇటీవల 11 మంది మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 120 మంది పాస్టర్స్‌కు నిత్యావసర కిట్లను అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సభ్యులు దైవజనులు, చిలుకూరి ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనం పథకం అమలులోకి తేవాలి


మంత్రి సుభాష్‌కు వినతి పత్రం అందచేస్తున్న నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పాస్టర్లకు గౌరవ వేతనం పొందే పథకాన్ని అమలులోకి తీసుకురావాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ మంత్రి సుభాష్‌ను కోరింది. సోమవారం క్యాంపు కార్యాలయంలో క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ అధ్యక్షుడు మోసా అబ్రహం ఆధ్వర్యంలో మంత్రిను కలిశారు. రాష్ట్రంలో 8,596 మంది గౌరవ వేతనం పొందే పాస్టర్లను తిరిగి పథకాన్ని అమలులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో కాకినాడ ఎన్‌సీసీ కాకినాడ జిల్లా చిల్డ్రన్స్ వింగ్ అధ్యక్షుడు కాసరపు సింహాద్రి, ఎస్సీ సంక్షేమ వింగ్ అధ్యక్షుడు టీఎస్ రాజు, జిల్లా కోఆర్డినేటర్ ఉదయకుమార్, సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వనమాడి సుందర్, ఎస్సీ సంక్షేమ వింగ్ ప్రెసిడెంట్ టి.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.